

నేటి నుంచి ఇసుక తవ్వకాలు

- 15తో ముగిసిన గ్రీన్‌ట్రిబునల్ ఆదేశాలు
- జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసరావు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి నిర్మాణాలకు ఉచిత ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటలో తెలిపారు. జాతీయ గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అక్టోబరు 15 వరకు నదుల్లో ఇసుక తవ్వకాలపై ఉన్న నిషేధం ముగిసిందన్నారు. గురువారం నుంచి పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక విధానం తిరిగి అమల్లోకి రానున్నదని ఆయన తెలిపారు. బల్క్‌గా అవసరమైన వారు అనుమతులు ఉన్న పల్లిపాడు,అప్పారావుపాళెం, మినగల్లు ,విరువూరు రీచ్‌ల్లోంచి లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుకను పొందవచ్చని తెలిపారు. డీ సిలిటేషన్ పాయింట్లైన నెల్లూరు, పోతిరెడ్డిపాళెం,సంగం, సూరాయపాళెం, కలువాయి,రాజుపాళెం స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. సామాన్యుల ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా నదులు,వాగులు,కా లువలు,వంకల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని తెలిపారు. నిర్మాణానికి ఎంత ఇసుక అవసరమో సచివాలయంలో తెలిపి అనుమతిపత్రం తీసుకోవాలన్నారు. ఉచితంగా ఇసుక రవాణా చేసే ప్రతీ వాహనం ముందుభాగంలో ఉచిత ఇసుక అంటూ బ్యానర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నవంబరు 15 వరకు

ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్

- కలెక్టరు హిమాన్షు శుక్లా

కందుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో జిల్లాలో గురువారం నుంచి నవంబరు 15 వరకు ఇండస్ట్రీ పార్టనర్ షిప్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కలెక్టరు హిమాన్షుశుక్లా తెలిపారు. బుధవారం కందుకూరులోని సబ్ కలెక్టరు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం రాష్ట్రంలో పారిశ్రామికవృద్ధిని వేగవంతం చేయటం, పెట్టుబడి దారులు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పరచడమేనన్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ఏపీఐఐసీ ప్రతినిధులు జిల్లాలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారని తెలిపారు.. స్థానిక పరిశ్రమల అభివృద్ధి, మౌలికసదుపాయాల విస్తరణ, కొత్త పెట్టుబడుల ప్రోత్సాహం, యువతకు ఉద్యోగావకాశాల సృష్టి ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టరు హిమవంశీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టనర్‌షిప్ డ్రైవ్ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టరు శుక్లా, అధికారులు

ప్రధానితో ఇంటరాక్షన్‌కు

సంగం టీచరు, విద్యార్థి



కర్నూలుకు బయలుదేరిన విద్యార్థి, ఉపాధ్యాయుడు

సంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పర్యటనకు గురువారం వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో జీఎస్టీ రీఫార్మ్ 2.0పై మోదీతో ఇంటరాక్షన్ కార్యక్రమానికి సంగం జడ్పీ హైస్కూల్‌కి చెందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు టీ. సుబ్రహ్మణ్యం, 10వ తరగతి విద్యార్థి యశ్వంత్‌కు ఆహ్వానం అందింది. దీంతో వారు కర్నూలుకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం బుజ్జయ్య, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

నుడా వీసీ బాధ్యతలు జేసీకి...

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) వైస్ ఛైర్మన్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నుడా వీసిగా గత జేసీ కార్తీక్ బాధ్యతలు నిర్వహిస్తూ వస్తుండగా ఆయన బదిలీ కావడంతో నుడా వీసీ పోస్టు ఖాళీ అయింది. అయితే ఆయన స్థానంలో జేసీగా వెంకటేశ్వర్లు నియమించినా, గత రెండువారాలుగా నుడా వీసీ పోస్టు ఖాళీగా ఉంది. అయితే ఎట్టకేలకు వీసీ బాధ్యతలు జేసీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డీఎస్‌డీవోగా యతిరాజే!

నెల్లూరు(విద్య), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో)గా ఆర్‌కే.యతిరాజ్‌నే మరికొంతకాలం కొనసాగించాలంటూ శాప్ ఎండీ ఎస్.భరణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాల డీఎస్‌డీవోల బదిలీల్లో భాగంగా నెల్లూరు డీఎస్ఏలో సీనియర్ ఫుట్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న పాండురంగారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఎస్‌డీవోగా నియమించారు. అయితే ప్రస్తుతం డీఎస్‌డీవోగా పనిచేస్తున్న ఆర్‌కె.యతిరాజ్ త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయన్ను నెల్లూరు డీఎస్ఏలోనే ఖోఖో కోచ్‌గా నియమించిన ఉత్తర్వులను రద్దు చేశారు. మరికొన్ని రోజుల్లో ఉద్యోగవిరమణ చేస్తున్న నేపథ్యంలో అప్పటి వరకు యతిరాజ్ డీఎస్‌డీవోగా కొనసాగాలంటూ ఉత్తర్వులను మార్పుచేశారు. ఆయన ఉద్యోగ విరమణ అనంతరం పాండురంగారావు బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆరోపణలపై అన్వేషణ

- రేషన్ మాఫియాపై నిగ్గుతేల్చేందుకు మంత్రి సన్నద్ధం
- జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులకు అమరావతికి పిలుపు
- మాఫియా నేతలు ఎవరు... వారి వెనుకున్న రాజకీయ శక్తులు ఏవి?



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీల వద్ద సివిల్ సప్లయ్స్ అధికారులు(ఫైల్)

నెల్లూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారిపడుతోందన్న ఆరోపణల్లో వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర సివిల్ సప్లయ్స్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉపక్రమించారు. ఇందుకోసం జిల్లా సివల్ సప్లయ్స్ అధికారి విజయ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ అర్జునరావును అమరావతికి పిలిపించారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, కొందరు అధికార పార్టీ నాయకులే మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తున్నారని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రెస్‌మీట్‌లో ఆరోపించడం, ఆ ప్రెస్‌మీట్‌లో సివిల్ సప్లయ్స్ మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును కూడా ప్రస్తావించడంతో కూటమి ప్రభుత్వంలో దుమారం రేగింది. నాదెండ్ల ఫిర్యాదుతో స్పందించిన టీడీపీ అధిష్ఠానం నుడా ఛైర్మన్‌ను పత్రికాముఖంగా నాదెండ్లకు క్షమాపణ చెప్పమని ఆదేశించింది. ఈ క్రమంలో బుధవారం కోటంరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకున్నారు. అయితే ఈ విషయాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ సీరియస్‌గా తీసుకున్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవాలు తెలుసుకోవడం కోసం విచారణ మొదలుపెట్టారు. ఈ క్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్లను అమరావతికి పిలిపించారు.

మూడు లారీలను వదిలి పెట్టారనే ఆరోపణలు

గతనెల 21న నెల్లూరు మూడో మైలు వద్ద గల సుభాన్‌నగర్‌లో ఐదు లారీల్లోని 180 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇందులో రెండు లారీలను రేషన్ బియ్యంగా గుర్తించి సీజ్ చేశారు. మూడు లారీల్లో సాధారణ బియ్యంగా గుర్తించి వదిలిపెట్టారు. ఈ విషయాన్ని కోటంరెడ్డి తప్పుపట్టారు. సివిల్ సప్లయ్స్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి మూడు లారీలను వదిలిపెట్టారని, రేషన్ మాఫియా నాయకుడికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇందులో నిజానిజాలు తెలుసుకోవడం కోసం మంత్రి నాదెండ్ల జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులను అమరావతికి పిలిపించారు. బుధవారం ఉదయం వీరు అమరావతికి చేరుకున్నారు. అయితే రాత్రి ఏడుగంటల వరకు కూడా వీరిని విచారించలేదని తెలిసింది.

సీరియస్‌గా తీసుకున్న మంత్రి నాదెండ్ల

ఇదిలాఉండగా రేషన్ బియ్యం పక్కదారి పట్టే విషయాన్ని మంత్రి నాదెండ్ల సీరియస్‌గా తీసుకున్నారు. రేషన్ బియ్యం తినడాన్ని ప్రజలు ఇష్టపడటం లేదు. దీంతో డీలర్లే కిలోకు రూ. 10 ఇచ్చి కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. రేషన్ డీలర్ల నుంచి కొంత మంది దళారులు బియ్యాన్ని సేకరించి లారీలలో చెన్నైకి తరలిస్తున్నారు. రేషన్ బియ్యం సేకరించి అక్రమ రవాణా చేసే దళారుల్లో అన్నీ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నారు. ఈ వ్యవహారం గత వైసీపీ ప్రభుత్వం నుంచి జరుగుతోంది. ఈ వ్యవహారాన్ని కూడా మంత్రి నాదెండ్ల సీరియస్‌గా తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో రేషన్ బియ్యం నిజంగా పక్కదారి పడుతోందా..? ఎంత మేర పక్కదారిపడుతోంది..? వాటిని సేకరించి చెన్నైకి తరలిస్తున్న దళారులు ఎవరు..? వారి వెనుక ఉన్న రాజకీయ శక్తులు ఏవి..? అనే వివరాలు తెలుసుకోవడం కోసం సివిల్ సప్లయ్స్ అధికారులను అమరావతికి పిలిపించారు.

ఇండోసోల్‌కు భూములిస్తే

పరిహారం ఇవ్వరా..?

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

ఉలవపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరేడులో ఏర్పాటు చేయనున్న ఇండోసో ల్ కంపెనీకి స్వచ్ఛందంగా భూములు ఇవ్వగా, తమ భూములకు కంపెనీ నుం చి నష్టపరిహారం అందించే విషయంలో రెవెన్యూ అధికారులు కుంటిసాకులతో తిప్పించుకుంటున్నారని రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముం దు ఆందోళన చేశారు. గత మూడు నెల ల నుంచి ఇండోసోల్‌కు ఇచ్చిన భూములను ఆన్‌లైన్ చేయకుండా వీఆర్వో, తహ సీల్దార్ తిప్పించుకుంటున్నారని కరేడు పంచాయతీ ధర్మారెడ్డి సంఘం ఎస్టీ కాలనీ వాసులు, ఉప్పరపాలెం ఎస్టీ కాలనీవాసులు వాపోయారు. ఎస్టీలకు చెందిన 18 ఎకరాల భూమిని అలగాయపాలెం, బట్టియసోమయ్యపాలెంకు చెందిన బీసీల నుంచి తిరిగి అప్పగించాలని తహసీల్దార్ లావణ్య ఎస్టీలకు ప్రొసీడింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. తమకు నష్టం జరిగిందని స్వచ్ఛందంగానే ఎస్టీలు భూములు అమ్మేశారని, తిరిగి తీసుకోవడంపై కొందరు బీసీలు హైకోర్టును ఆశ్రయించారు. ఆ భూములను 75 రోజుల్లో ఆన్‌లైన్ చేసిస్తామని అప్పటి తహసీల్దార్ చెప్పారని, నెలలు గడుస్తున్నా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారేతప్ప పరిష్కరించడం లేదని ఎస్టీ యానాది సంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ టీ. శ్రీనివాసులు కందుకూరు జరిగే కలెక్టర్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో యానాది సంఘం నాయకులు కందుకూరు సబ్‌కలెక్టర్ హిమవంశీతో ఫోన్‌లో మాట్లాడారు. గురువారం ఉదయం కందుకూరు వచ్చి సమస్యపై మాట్లాడాలని ఆయన బాధితులకు సూచించారు.



ఉలవపాడు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

భూసమస్యలు పరిష్కరిస్తున్నాం..

ఇండోసోల్‌కు స్వచ్ఛందంగా ఇస్తున్న భూముల విషయంలో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు వివరణ ఇచ్చారు. ధర్మారెడ్డి సంఘం ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్య హైకోర్టులో ఉన్నందున ఆ భూమలకు ఆన్‌లైన్ సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మార్కెట్లపై దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- కూరగాయల మార్కెట్, దుకాణాల్లో తనిఖీలు
- తూకాల్లో వ్యత్యాసం
- ఐదుగురు వ్యాపారులపై కేసులు




నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్లో వేయింగ్ మిషన్‌ను తనిఖీ చేస్తున్న తూ.కొ. అధికారి

నెల్లూరు(సిటీ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పలు మార్కెట్లలో తూకాల్లో వస్తున్న భారీ తేడాలను తూనికల, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్లు పసికట్టారు. బుధవారం వారు పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. 'కిలోకి అరకిలోనే '.. అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తూనికల, కొలతలశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ షేక్ రియాజ్‌అహ్మద్, కావలి ఇన్‌స్పెక్టరు షేక్ మోహీసిన్, టెక్నికల్ సిబ్బంది శ్రీకాంత్ స్పందించారు. వారంతా నెల్లూరులోని ఏసీ కూరగాయల మార్కెట్, మైపాడు గేట్ వద్దనున్న మత్స్యభవన్, కోనేటిమిట్ట కూరగాయల మార్కెట్లతోపాటు వివిధ కూడళ్ల వద్ద నున్న చికెన్, మటన్, చిల్లర దుకాణాలను తనిఖీలు చేపట్టారు. తూకాల్లో భారీగా తేడాలు కనబడడంతో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్లు వెల్లడించారు. వ్యాపారులు చట్టంప్రకారం ధ్రువీకరించిన పరికరాలను మాత్రమే ఉపయోగించాలని వారు సూచించారు.

సోమశిలకు

12,093 క్యూసెక్కుల ప్రవాహం



అనంతసాగరం అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం 12,093 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో డ్యాంలో 73.866 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టెన్నల్ ద్వారా దిగువకు 2,600, గేట్ల ద్వారా 7,500 ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

కండలేరులో..

రాపూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు పూర్తిస్థా యి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 59.890 టీ ఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలి పారు. సోమశిల నుంచి 3350 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, 2740 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

పెళ్లి చూడకనే ప్రాణాలు వదిలారు...

- బైకును ఢీకొన్న బోర్‌వెల్ లారీ
- అక్కడికక్కడే ముగ్గురి మృత్యువాత
- మృతుల్లో తల్లిదండ్రులు, పెద్ద కుమార్తె
- చిన్నకుమార్తెకు తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన బోర్‌వెల్ లారీ, తీవ్రంగా గాయపడ్డ మేఘన



కలిగిరి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): ముద్దులొలికే ఇద్దరు చిన్నారులు, భార్యతో కలిసి స్వగ్రామంలో ఈనెల 18న జరగనున్న పెళ్లికి వచ్చింది ఆ కుటుంబం. పెళ్లి వేడుక చూడకముందే రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. మరో చిన్నారి తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలైంది. ఈ ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కలిగిరి మండలం తూర్పుదూబగుంట గ్రామానికి చెందిన చవలమూడి బాబు బేల్దారి పని చేసుకోవడానికి సుమారు పదేళ్లక్రితం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ వెళ్లాడు. అక్కడే బేల్దారి పనులకు వచ్చిన మధ్యప్రదేశ్‌కి చెందిన యువతి మమతను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. బాబుకు ఇద్దరు కుమార్తెలు, పెద్దకుమార్తె వైభకు ఆరేళ్లు. చిన్న కుమార్తె మేఘనకు ఐదేళ్లు. స్వగ్రామంలో ఈనెల 18న బంధువుల వివాహం ఉండటంతో 10రోజుల ముందుగానే కుటుంబంతో కలిసి బాబు స్వగ్రామానికి వచ్చాడు.

ఆధార్ కోసం వచ్చి...

ఈ క్రమంలో భార్య ఆధార్‌కార్డులో అడ్రస్‌ను మధ్యప్రదేశ్ నుంచి దూబగుంటకు మార్చుకోవడంతో పాటు, కుమార్తెలకు కొత్త ఆధార్‌కార్డులు తీయించడానికి బుధవారం ఉదయం బాబు కలిగిరికి వచ్చాడు. ఆధార్ దరఖాస్తు ఫారాలు రాయించుకొని కలిగిరి నుంచి తూర్పు దూబగుంటకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో చిన అన్నలూరు విద్యుత్‌సబ్‌స్టేషన్, తెల్లపాడు క్రాస్ రోడ్డు సమీపానకొచ్చేసరికి కుడుములదిన్నెపాడు నుంచి చినఅన్నలూరుకు ఎరువులను తీసుకెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో మోటారు సైకిల్‌ను రోడ్డునుంచి మార్జిన్ కిందకు దింపాడు. తిరిగి రోడ్డుపైకి ఎక్కే క్రమంలో మోటార్‌బైక్ అదుపుతప్పి బైక్‌లో ఉన్న నలుగురు రోడ్డుపై పడిపోయారు. ఇంతలో ఎదురుగా నరసారెడ్డిపాలెంలో బోరు వేసి వింజమూరు వెళ్తున్న లారీ వీరిని ఢీకొట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో బాబు(35), మమత(28), వైభ(5) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారి మేఘన చేతిపై లారీ వెళ్లడంతో చేయి నుజ్జునుజ్జు అయింది. ప్రమాదం విషయం తెలియగానే కాలనీవాసులు ఘటనాస్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

నాలుగేళ్ల క్రితం సోదరి మృతి

కాగా బాబు సోదరి కొండాపురం మండలం జంగాలపల్లిలో అత్తవారింటలో నాలుగేళ్ల క్రితం పాము కాటుకు గురై మరణించింది. బాబు తల్లి, తండ్రి హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ ఇటీవల వారు కూడా స్వగ్రామానికి వచ్చారు. తండ్రి శ్రీనివాసులు రెండురోజుల క్రితం తిరిగి హైదరాబాద్ వెళ్లగా, తల్లి స్వగ్రామంలోనే ఉంది. పెళ్లి వేడుకలతో సంతోషంగా గడపాల్సిన కాలనీ మొత్తం బాబు కుటుంబం మృత్యువాత పడటంతో విషాదంలో మునిగిపోయింది.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా మృతదేహాలు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

● జట్లకొండూరులో విషాదం


కసుమూరు రమేష్ మృతదేహం

మనుబోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంక చదవలేను.. తన భవిష్యత్తు ఏమిటో అన్న ఆలోచనతో, మనస్తాపానికి గురై ఇంటర్మీడియట్ చదువుతున్న మండలంలోని జట్లకొండూరు దళితవాడకు చెందిన కసుమూరు రమేష్ (19) ఆత్మహత్య చేసుకుని బుధవారం చనిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. జట్లకొండూరు గ్రామానికి చెందిన కసుమూరు రాగయ్య, ప్రమీల దంపతులకు ముగ్గురు కుమారులు. సుమారు పదేళ్ల క్రితం రాగయ్య చనిపోయాడు. దీంతో ప్రమీల కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. పెద్దకుమారుడు చదువుకుంటుండగా, రెండో కుమారుడు కాకినాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆఖరి కుమారుడు రమేష్ గతేడాది వరకు కాకినాడలో ఉండి ఇంటర్ చదివాడు. అయితే పరీక్షలకు హాజరుకాకుండా వచ్చేశాడు. దీంతో మరల ఇంటర్ చదివేందుకు మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాడు. అయితే పరీక్షలు రాయడం కుదరదని, సాంకేతిక లోపం వలన మీరు మరల కాకినాడ కళాశాలలోనే ఫీజు కట్టి పరీక్షలు రాయాలని చెప్పారు. దీంతో రమేష్ తాను పరీక్షలు రాయలేనని, తనకు భవిష్యత్ లేదని ఎప్పుడూ మదనపడుతుండేవాడు. ఈక్రమంలోనే కొద్ది రోజుల క్రితం తల్లి మందలించడంతో చేయికోసుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం బ్యాగులో రెండు పుస్తకాలు, సెల్‌ఫోన్ తీసుకుని ఇంటినుంచి బయటకు వచ్చేశాడు. కాలేజీ పనిమీద వెళ్లాడని తల్లి అనుకుంది. రాత్రికి ఎంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతకసాగారు. సెల్‌కు ఫోన్ చేస్తున్నా తీయడం లేదు. దీంతో సెల్ లోకేషన్ పెట్టడంతో కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయరహదారి పక్కన బహిరంగ ప్రదేశంలో చూపింది. దీంతో బంధువులు, స్థానికులు అక్కడకు వచ్చి చూసేసరికి రమేష్ చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ పరారీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళా ప్రాంగణం నుంచి పరారైన ఓ మహిళపై వేదాయపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గతనెల 29వ తేదీ దర్గామిట్ట పోలీసులు ఓ మహిళను నిందితురాలిగా ఓ కేసులో చేర్చి ఆమెను మహిళా ప్రాంగణంలో చేర్పించారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉంటోంది. బుధవారం ఉదయం టిఫెన్ తిన్న తర్వాత చేతులు కడుక్కొన్ని వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మహిళా ప్రాంగణం వాచ్‌ఉమెన్ సుమలత వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

రేపు ఎస్‌జీఎఫ్ హాకీ క్రీడాకారుల ఎంపికలు

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 17న ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాల, బాలికల హాకీ జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శులు బీవీ.రమణయ్య, ఎం.దేవిక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నీ పాఠశాల క్రీడాకారులు ఎంపికలకు హాజరు కావాలన్నారు.

ఇళ్లు లేకనే.. విద్యుత్తా..?

● రూ. కోట్ల విద్యుత్ సామగ్రి నిరుపయోగం
● జగనన్న కాలనీల్లో వృథాగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు
● చోరీకి గురవుతున్న పరికరాలు
● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సామగ్రి నిరుపయోగంగా మారింది. ముఖ్యంగా ఆత్మకూరు, కోవూరు, కావలి డివిజన్ల పరిధిలో వ్యయం చేసిన సుమారు రూ.24 కోట్లు వృథాగా మారాయి. ఈ దుస్థితి జిల్లాలోని అన్నీ మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొంది. అప్పట్లో పాలకులు, ఉన్నతాధికారుల నుంచి ట్రాన్స్‌కో అధికారులకు వచ్చిన ఒత్తిళ్ల దృష్ట్యా కనస్ట్రక్షన్ ఇంజనీరింగ్ అధికారులు హడావుడిగా ఏర్పాటు చేసిన స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు అలంకారప్రాయంగా మారాయి. పలు లేఅవుట్లలో విద్యుత్ సరఫరా సైతం నోచుకోలేదు. అప్పట్లో నాసిరకంగా పనులు చేపట్టడంతో స్తంభాలు నేలకొరిగాయి.

● చోరీకి గురవుతున్న పరికరాలు

గ్రామాలు, పట్టణాలకు దూరంగా లేఅవుట్లు ఉండడంతో విద్యుత్ సామగ్రి, స్తంభాలు చోరీకి గురవుతున్నాయి. జగనన్న కాలనీలు నివాసయోగ్యంగా లేకపోవడం, మౌలిక వసతులు లేని కారణంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకొనేందుకు ఇష్టపడలేదు. ఇళ్ల నిర్మాణం కొన్ని ప్రదేశాల్లో కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో వారు నాసిరకంగా, అసంపూర్తి నిర్మాణాలు చేపట్టి వదిలేశారు. కొన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో బేస్‌మట్టాలు, మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని లేవుట్లు ముళ్లచెట్లతో నిండి అడవులను తలపిస్తున్నాయి. దీంతో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పార్మర్లు, స్తంభాలు, తీగలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. లేఅవుట్లలో వేసిన స్తంభాలు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని నేలకొరగ్గా, మరికొన్ని ఒరిగిపోయాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ పరికరాలు చోరీకి గురికాకుండా చర్యలు చేపట్టాలి. విద్యుత్ సరఫరా లేని లేఅవుట్లలో సరఫరా పునరుద్ధరించాలని జగనన్న ఇళ్ల లబ్ధిదారులు పలువురు కోరుతున్నారు.


కొండాయపాళెం జగనన్న లేఅవుట్‌లో అలంకారప్రాయంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


లేఅవుట్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నూతన దంపతులపై దాడి

కావలి రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇష్టంలేని వివాహం చేసుకుందన్న కోపంతో యువతి తల్లిదండ్రులు, బంధువులు నూతన దంపతులపై కారం చల్లి దాడి చేసిన సంఘటన బుధవారం కావలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. కావలి పట్టణం వైకుంఠపురంకు చెందిన జవంగల మనోజ్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన శివస్పందన 3 ఏళ్లుగా ప్రేమించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయి ఈనెల 3వ తేదీన హైదరాబాద్‌లోని గండి మైసమ్మ ఆలయంలో వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి ఈనెల 6వ తేదీన నెల్లూరులో ఎస్పీని ఆశ్రయించారు. తమకు తన తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని శివస్పందన ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు దర్గామిట్ట పోలీస్ స్టేషన్, కావలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లలో పలుమార్లు ఇరువురి కుటంబ సభ్యుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా వారిలో ఎలాంటి మార్పు లేకపోయింది. ఈ క్రమంలో మంగళవారం మనోజ్ ఇంటికి వెళ్లిన యువతి తల్లిదండ్రులు కోటేశ్వరరావు, ధనలక్ష్మి, బంధువులు మా ఆస్తితో ఎలాంటి సంబంధం లేదని పోలీస్ స్టేషన్‌లో రాసి ఇవ్వాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో పోలీస్ స్టేషన్‌కు రావాలని ఇరువురి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం మనోజ్ కుమార్, శివ స్పందన, మనోజ్ తల్లి పద్మ స్టేషన్ సమీపంలోకి వచ్చే సరికి యువతి తల్లిదండ్రులు, మరో నలుగురు వారిని అడ్డగించి కళ్లలో కారం చల్లి దాడి చేశారు. ఈ ఘటనతో మనోజ్ తల్లి పద్మ పెద్దగా కేకలు వేస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లే సరికి దాడికి పాల్పడిన వారు కారులో పరారయ్యారు. యువతి తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా లాడ్జీలు, వాహనాల తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

నెల్లూరు(క్రైం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు మంగళవారం రాత్రి లాడ్జీలు, వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 2139 వాహనాలను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ డ్రింకింగ్ కేసులు 27, డ్రంక్అండ్ డ్రైవ్ 30, ఎంవీ యాక్ట్ కేసులు 258 నమోదు చేసి, రూ.1,43,810 అపరాధ రుసుము విధించామన్నారు. 68 లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు, బస చేసిన వ్యక్తుల వివరాలపై ఆరా తీశామన్నారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా యాజమాన్యాలు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. నేర నియంత్రణకు జిల్లా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు, డయల్ 112కు తెలియజేయాలని ఆమె ప్రజలను కోరారు.

గూగుల్ అంటే జగన్‌కి కడుపు మంట


విలేకరులతో మాట్లాడుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : 'గూగుల్ అంటే జగన్మోహన్‌రెడ్డికి కడుపు మంట.. ఎందుకంటే.. ఆయన బండారం మొత్తాన్ని గూగుల్ బయటపెడుతోంది. గూగుల్‌లో 6093 అని కొడితే జగన్‌రెడ్డి జైలు జీవితం మొత్తం బయటకొస్తోంది. రాజా ఆఫ్ కరెప్షన్ అని కొట్టినా వారి చరిత్రే వస్తోంది. తండ్రిని అడ్డం పెట్టుకొని రూ.వేల కోట్లు దోపిడీ చేసిన చరిత్ర గూగుల్‌లో కనిపిస్తోంది. గూగుల్ టేకవుట్ టెక్నాలజీ ద్వారా వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసిన వారిని సీబీఐ గుర్తించింది. జగన్‌రెడ్డి, వారి బ్యాచ్ గుట్టులను రట్టు చేస్తోందనే గూగుల్‌పై కోపం పెంచుకున్నారు. అందుకే విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుంటే వైసీపీ నేతల కడుపు మండుతోంది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులతో గూగుల్ సంస్థ ఏపీకి రావడం గొప్ప పరిణామమన్నారు. మంత్రి నారా లోకేష్ కృషితోనే కొత్త రాష్ట్రమైన ఏపీ ఈ ఘనతను సాధించిందని కొనియాడారు. రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన సంస్థ వస్తుంటే జగన్‌రెడ్డి మీడియాలో ఒక్క వార్త కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంత కడుపుమంటతో రగిలిపోయే వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారని చెప్పుకోవడానికి ప్రజలు బాధపడుతున్నారు. అలాంటి వ్యక్తి మళ్లీ సీఎం అవుతానంటూ కలలు కనడం దుర్మార్గమని సోమిరెడ్డి విమర్శించారు.

కాసేపు ఎండ... కాసేపు వాన !


నెల్లూరు నగరంలో కురుస్తున్న వర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం ఉదయం భారీవర్షం పడింది. అల్లూరు, ముత్తుకూరు, బోగోలు, నెల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. బుధవారం తెల్లవారు జాము నుంచి వర్షం పడటంతో జిల్లాలో చల్లని వాతావరణం ఏర్పడింది. ఉదయం 10 నుంచి ఎండ కాసింది. సాయంత్రం కూడా జిల్లావ్యాప్తంగా కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఒక మోస్తరు వర్షం పడింది. జిల్లాలో గురువారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిసింది. బుధవారం జిల్లాలో సగటు వర్షపాతం 6.8 మిమీగా నమోదైంది. అత్యధికంగా అల్లూరులో 30.6మీమీ వర్షం పడింది. అత్యల్పంగా సైదాపురం, కందుకూరులో 1.4మి.మీ వర్షం పడింది. ముత్తుకూరులో 25.4, బోగోలులో 22, కోవూరులో 17.8, విడవలూరులో 17.2, ఏఎస్‌పేటలో 16.2, నెల్లూరు రూరల్ 12.4, నెల్లూరుఅర్బన్‌లో 8.4 మి.మీ వర్షం పడింది.

నా మాటలను అన్యథా భావించవద్దు

● మంత్రి నాదెండ్లకు నుడా చైర్మన్ కోటంరెడ్డి విజ్ఞప్తి


విలేకరులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : 'నాకు మంత్రి నాదెండ్ల మనోహర్ అంటే ఎంతో గౌరవం. రేషన్ బియ్యం అక్రమ రవాణా మూలంగా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదన్న ఉద్దేశ్యంతోనే నేను మాట్లాడాను. నేను ఎవరి ఉద్దేశించి మాట్లాడలేదు. జనసేన నేతలు, కార్యకర్తల గురించి నేను వ్యాఖ్యలు చేయలేదు. నా మాటలను అన్యథా భావించవద్దు. నా మాటలకు నాదెండ్ల మనోహర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నా' అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొందరు అధికారుల తప్పిదాల వల్లే రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని, వారు సక్రమంగా వ్యవహరించడం లేదని మాత్రమే తాను మాట్లాడానని కోటంరెడ్డి వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు సమర్థతతో రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, అది చూస్తున్న వైసీపీ నేతలకు కడుపు మండుతోందని విమర్శించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఓ చరిత్ర అని ఆయన పేర్కొన్నారు.

ఆటో బోల్తాపడి పలువురికి గాయాలు

ఉదయగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడి పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పలువురు దుత్తలూరులోని ఓ బొగ్గుబట్టీ వద్దకు పనికి వెళుతున్నారు. ఈ తరుణంలో గ్రామ శివారున ఆటోకు అడ్డంగా ఒక్కసారిగా గేదె రావడంతో దానిని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నాగూర్, కాశమ్మ, గోనెపూడి వెంకటయ్య, వెంకటలక్ష్మమ్మ భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆటోడ్రైవర్ కార్తీక్ మరో ఆటోకు ఫోన్ చేసి వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో తీవ్ర గాయాలైన నాగూర్‌ను మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించారు. ఈ ప్రమాదంపై వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి విచారణ జరుపుతున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కోవూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగవరంకు చెందిన షేక్ అబ్దుల్ రహమాన్ (45) బుధవారం పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆయన మోటారు బైక్‌పై రైలు పట్టాల వద్దకు చేరుకున్నాడు. బైక్‌ను రైలు పట్టాల పక్కనే ఉంచి రైలు కింద పడినట్లు భావిస్తున్నారు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి కావలి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి మోటారుబైక్ ఆధారంగా మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు కావలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వింజమూరు ఎంఈవో-1పై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(విద్య), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడిని అకారణంగా దుర్భాషలాడిన వింజమూరు ఎంఈఓ-1పై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నేతలు కోరారు. నగరంలోని డీఈవో బుధవారం డీఈవో బాలాజీరావుకు నేతలు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు మాట్లాడుతూ వింజమూరులో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులతో ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే ఎంఈవో-1 రమేష్ సొంత అజెండాతో సమావేశం నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై అభ్యంతరం తెలిపిన ఉపాధ్యాయుడు కొండారెడ్డిని పరుష పదజాలంతో దూషించడంతో పాటు బెదిరింపులకు గురిచేశాడన్నారు. దీనిపై డీఈవో విచారణ జరిపి, ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు వీ.శివకోటారెడ్డి, ఫెడరేషన్ నేతలు పాల్గొన్నారు.

విరువూరులో పూరిల్లు దగ్ధం

● రూ.2.50లక్షల నష్టం

పొదలకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైన సంఘటన పొదలకూరు మండలం విరువూరులో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు కొండమ్మ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొండమ్మ ఇంట్లో వంట చేస్తుండగా మంటలు చెలరేగడంతో ఇల్లు దగ్ధమైందని, సుమారు రూ.2.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె వేడుకొంది. సమాచారం అందుకున్న పొదలకూరు ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి విజయ్‌కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రూ.10 లక్షల విలువ చేసే పురుగు మందుల సీజ్


సతీష్‌రెడ్డి రైతు డిపోలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పొదలకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు పట్టణంలోని సతీష్‌రెడ్డి రైతు డిపో (ఎరువులు, పురుగు మందుల దుకాణం)లో నెల్లూరు విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు, ఏఓ పి.వేణుగోపాల్‌రావు, పొదలకూరు ఏఓ ప్రతాప్, తమ సిబ్బందితో కలిసి దుకాణాన్ని తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో గల తన నివాస గృహంలో నిల్వ ఉంచిన రూ.10లక్షల విలువైన పురుగుల మందులు, బయో ప్రొడక్ట్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించి వాటిని సీజ్ చేశారు. అలాగే కాల పరిమితి పూర్తయిన రూ.72వేల విలువైన పురుగుల మందులను కూడా గుర్తించినట్లు వారు పేర్కొన్నారు. కాలం చెల్లిన పురుగు మందులను రైతులకు అమ్ముతూ మోసం చేస్తుండడంతో ఛీటింగ్ కేసు పెడుతున్నట్లు వారు తెలిపారు.

మల్లికార్జున అవయవదానం

● ఇద్దరికి ప్రాణదానం



మల్లికార్జున మృతదేహానికి వీడ్కోలు పలుకుతున్న కిమ్స్ వైద్యశాల సిబ్బంది (ఇన్‌సెట్‌లో) మల్లికార్జున (ఫైల్)

ఇందుకూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేటకి చెందిన మాచవరం మల్లికార్జున ఈనెల 12వతేదీ ఉదయం నిద్రలేచే సమయానికి కాళ్లు చేతులు కదల్లేదు. అంతేకాక ఆయన శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ ఉదయ్‌కుమార్ పరీక్షలు నిర్వహించి ఇస్కీమిక్ స్ట్రోక్ (సీవీఏ) ఒత్తిడి పెరగడం వల్ల మెదడు వాపు వచ్చి, మెదడు పక్కకు జరగడంతోపాటు అధిక రక్తపోటు ఉన్నట్లు మల్లికార్జున కుటుంబ సభ్యులకు తెలిపారు. సర్జరీ చేసినా ఎటువంటి ప్రయోజనం ఉండదని కుటుంబ సభ్యులకు డాక్టర్లు తెలిపారు. అయినా కుటుంబ సభ్యులు సర్జరీ చేయమని కోరగా, డాక్టర్ ఉదయ్‌కిరణ్ సర్జరీ చేశారు. ఈ క్రమంలో మల్లికార్జున మంగళవారం బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. ఈ క్రమంలో వైద్య బృందం అవయవదానం ప్రాముఖ్యతను గురించి కుటుంబ సభ్యులకు వివరించారు. మృతుడి భార్య అమరావతి, కుమారులు కార్తికేయ, వివేకానంద అంగీకరించడంతో డాక్టర్లు జీవనదాన్ సంస్థకు వివరించారు. జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం అవయవాలు కేటాయింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జీవన్‌దాన్ సంస్థ మృతుడి అవయవాలను సేకరించింది. అనంతరం కర్నూలు హాస్పిటల్‌కు లివర్‌ను, నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌కు కిడ్నీని అందచేశారు.

● ఘనంగా వీడ్కోలు

మరణించిన తర్వాత కూడా పలువురి జీవితాలలో కొత్త వెలుగులు నింపిన మల్లికార్జున మృతదేహానికి కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, మల్లికార్జున మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున కుమారులు మాట్లాడుతూ మా తండ్రి భౌతికంగా లేకపోయినా, ఆయన అవయవాలు మరికొందరికి వెలుగునిస్తే అదే ఆనందమన్నారు.

ప్రేమ.. పెళ్లి పేరుతో రూ. 80 లక్షల స్వాహా

కిలాడీ లేడీపై కేసు

నెల్లూరు(క్రైం) అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నాని...పెళ్లి చేసుకుంటానని యువతులను మోసం చేసే యువకుల గురించి వింటూనే ఉంటాము. కానీ, ఓ యువతి ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువకుడిని నమ్మించి అతని వద్ద నుంచి రూ.లక్షలు తీసుకుని మోసగించింది. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని జెండావీధికి చెందిన నాని యూట్యూబ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు 2023లో ఆన్‌లైన్‌లో కాకినాడకు చెందిన ఓ యువతి పరిచయం అయ్యింది. ఇద్దరు రెండు నెలలు ఫోన్ చాటింగ్ చేసుకున్నారు. ఆ తర్వాత సదరు యువతి ఏడాదిపాటు నానితో మాట్లాడటం మానేసింది. అనంతరం ఓ రోజు నానికి ఫోన్ చేసి... ఇంట్లో నుంచి వచ్చేస్తానని తనకు ఓ ఉద్యోగం కావాలని కోరింది. దీంతో నాని ఆమెకు ట్రేడింగ్ చేయడం నేర్పించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం పెరిగి ప్రేమగా మారింది. అప్పటి నుంచి నాని వద్ద యువతి నగదు తీసుకోవడం ప్రారంభించింది. చదువుకోసమని రూ.3లక్షలు, హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం రూ.9 లక్షలు తీసుకుంది. ఈ క్రమంలోనే తన తల్లి, బావను నానికి పరిచయం చేసింది. నానిని పెళ్లి చేసుకుంటానని వారికి చెప్పడంతో వారు అంగీకరించారు. ఆ తర్వాత పుట్టినరోజుకు బంగారు ఆభరణాలు కొంటానని రూ.5లక్షలు, ఆరోగ్యం బాగలేదని చెప్పి విడతల వారీగా రూ.24 లక్షలు నాని నుంచి తీసుకుంది. పెళ్లి ఎప్పుడు చేసుకుందామని నాని పలుమార్లు అడిగితే కాలయాపన చేస్తూ రావడంతో నానికి అనుమానం వచ్చి ఆరాతీశాడు. యువతికి అప్పటికే తన బావతో వివాహం అయ్యిందన్న విషయం తెలుసుకున్నాడు. ఉద్దేశపూర్వకంగా తనను మోసగించి రూ.80 లక్షలు తీసుకున్నారంటూ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సదరు కిలాడీ లేడీపై కేసు నమోదు చేశారు.

సురక్ష యాప్‌లో స్కాన్‌చేసి మద్యం విక్రయించాలి

నెల్లూరు(క్రైం) అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బార్లు, మద్యం షాపుల యాజమానులు మద్యం అమ్మకాలు జరిపేటప్పుడు తప్పనిసరిగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలను స్కాన్ చేసి అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ డీసీ ఎం. శంకరయ్య తెలిపారు. బుధవారం నగరంలోని పలు బార్లు, వైన్ షాపుల్లోని సిబ్బందికి సురక్ష యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్ష యాప్ వినియోగం ద్వారా పారదర్శకత, బాధ్యతయుతమైన వ్యాపారం, నకిలీ మద్యం నివారణ లక్ష్యాలను సాధించవచ్చన్నారు. బార్లు, మద్యం దుకాణాల్లో సురక్ష యాప్‌లో స్కాన్ చేయకుండా సీసాలను విక్రయించడం పూర్తిగా నిషేధమన్నారు. మద్యం కొనుగోలు చేసే వినియోగదారులు కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని యాప్ ద్వారా బాటిల్ వివరాలను చెక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం నగరంలోని నెల్లూరు ఎక్సైజ్ స్టేషన్‌లో నగరపరిధిలోని బార్లు, మద్యం దుకాణాల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించి యాప్‌పై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ నెల్లూరు-1 ఇన్‌స్పెక్టర్ పీ రమేష్‌బాబు, ఎస్‌ఐలు ఎస్ ప్రభాకరరావు, డీ శ్రీధర్, జెకెవిఎస్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

జీఎస్టీ ఉత్సవ్ సభకు 250 బస్సులు

● సామాన్యుల అవస్థలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కర్నూలులో గురువారం జరిగే జీఎస్టీ ఉత్సవ్ సభకు జిల్లా నుంచి అధికారులు 250 ఆర్టీసీ బస్సులను బుధవారం పంపారు. ఆత్మకూరు డిపో నుంచి 31, కందుకూరు నుంచి 35, కావలి నుంచి 40, నెల్లూరు-1 నుంచి 40, నెల్లూరు-2 నుంచి 50, రాపూరు నుంచి 25, ఉదయగిరి డిపో నుంచి 29 చొప్పున బస్సులను పంపారు. వందల బస్సులు సభకు వెళ్లడంతో బుధవారం జిల్లా ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పలేదు. ఎంతో మంది గంటల సమయం బస్సుల కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు. పలువురు ప్రయాణాలను రద్దు చేసుకోగా, మరికొందరు ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. గురువారం కూడా ఈ ప్రయాణ కష్టాలు కొనసాగనున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100): 550	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.12156
వెండి కిలో ధర	రూ. 1,80,000
వెండి ఒక గ్రాము	రూ.189.00

ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత దారుణం

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా అందించే సేవలను నిలిపివేయాలని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ నిర్ణయించడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సకాలంలో వైద్యం అందక ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి ఏర్పడుతుందని, ముఖ్యంగా డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతారని తెలిపారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 'ఎన్టీఆర్ వైద్య సేవ'ను కొనసాగించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం కూడా చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు.

గూగుల్ ఏర్పాటు హర్షణీయం

● ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ డేటా హబ్ ఏర్పాటు చేయటం హర్షణీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అన్నీ రంగాల్లో ముందుకు తీసుకువెళుతున్నారని తెలిపారు. రూ.1.33లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి తీసుకువచ్చిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సాంకేతికంగా రాష్ట్రం తొలిస్థానంలో నిలుస్తుందని, సిటీ ఆఫ్ డెస్టినీగా ప్రపంచమంతా విశాఖవైపు చూసేలా చేశారని కొనియాడారు.

ఆ ఘనత చంద్రబాబుదే

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా గూగుల్ హబ్‌ను రాష్ట్రానికి తీసుకురావటం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మరో ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తూ ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి సాధించటం ఇదే ప్రథమమని తెలిపారు.

అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లైసెన్సు కలిగిన వారు మాత్రమే ఆర్ఎస్ఆర్ స్కూల్ ఆవరణలోనే టపాసుల విక్రయ దుకాణాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా సెంటర్లలో, రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసుకొని టపాసులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. టపాసుల అక్రమ విక్రయాలు, నిల్వల సమాచారాన్ని డయల్ 112, 9440796306 నెంబర్లకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

ప్రధాని పర్యటనను వ్యతిరేకిస్తున్నాం

● సీపీఎం నాయకుడు రమేష్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తున్నామని సీపీఎం రాష్ట్ర నాయకుడు మూలం రమేష్ తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. జీఎస్టీ తగ్గించామనే ప్రచారంలో భాగంగా ప్రధాని కర్నూలుకు రావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. జీఎస్టీని సంపన్న వర్గాలకు మాత్రమే తగ్గించారని, సామాన్య ప్రజలకు నిత్యవసర సరుకులు, మందుల ధరలు తగ్గిస్తానని చెప్పిన కేంద్రం ఎక్కడా తగ్గించలేదని ఆరోపించారు.

మురుగులో జగనన్న కాలనీ

● రోడ్లన్నీ మురుగుమయం
● దారిలేక ప్రజల అవస్థలు
● దుర్వాసన, దోమల బెడద

నెల్లూరు(వెంకటేశ్వరపురం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలో ఉన్న జగనన్న కాలనీ మురుగుమయంగా మారింది. జాతీయ రహదారికి అవతలివైపు ఉన్న లేఅవుట్‌లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఆ ప్రాంతంలో చేపల మార్కెట్ ఉండటంతో వ్యాపారులు మురుగు, నీరు నీళ్లను జగనన్న కాలనీలోకి వదులుతున్నారు. దీంతో రోడ్లు మురుగుతో నిండిపోతున్నాయి. కాలనీ వాసులు వెళ్లేందుకు దారి కూడా లేని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి మురుగునీరు నిలువ ఉండటంతో భారీగా పిచ్చిచెట్లు పెరిగాయి. దీంతో ఈ ప్రాంతంలో దోమలు, విషకీటకాల బెడద ఎక్కువగా ఉంది. తీవ్రమైన దుర్గంధం వ్యాపిస్తోంది. చేపల మార్కెట్ నుంచి మురుగునీటిని కాలనీలోకి వదలడం వల్ల ఈ ప్రాంతంలో నూతనంగా నివాసాలు నిర్మించుకునే వారు సైతం పనులు ఆపేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి చేపల మార్కెట్ మురుగునీరు కాలనీలోకి రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





జగనన్న కాలనీలో మురుగు, పిచ్చి మొక్కలు

జీతాలివ్వండి మహాప్రభో..!

● మండల సభలో ఎంపీపీ, ఎంపీటీసీల అభ్యర్థన
● వరికి మద్దతు ధర అందకపోవడంపై అసంతృప్తి

నెల్లూరు రూరల్, అక్టోబరు 15,(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజా ప్రతినిధులుగా ఉన్నామనేగానీ 30 నెలలుగా రూపాయి జీతం ఇవ్వలేదని నెల్లూరు రూరల్ మండలం ఎంపీపీ బూడిద విజయ కుమార్‌తో పాటు, మండలంలోని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రగతి సమీక్ష జరిపారు. అనంతరం ఎంపీపీ, కొందరు ఎంపీటీసీలు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ప్రతీ నెల గౌరవ వేతనంగా ఇచ్చే రూ.3 వేలు 30 నెలలుగా అందడం లేదని ఆరోపించారు. తనకు రావాల్సిన రూ.6 వేల గౌరవవేతనం కూడా అందడం లేదని ఎంపీపీ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీవో రమణమ్మను కోరారు. కాగా, వ్యవసాయం చేసే రైతులకంటే అపార్టుమెంట్ల దగ్గర వాచ్‌మెన్‌గా ఉండటంమేలని కొందరు సభ్యులు పేర్కొన్నారు. వరికి కనీస మద్దతు ధర అందకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎడగారు సీజన్‌లో సాగు చేసిన వరికి ఎప్పుడూ లేనంతగా పుట్టి ధరను రూ.13 వేలకు దిగజారి రైతులు అమ్ముకోవాల్సి వచ్చిందని వాపోయారు. ఇదిలా ఉండగా ఏఎంసీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మనుబోలు శ్రీధర్‌రెడ్డి, గుండ్లపాళెం సొసైటీ అధ్యక్షుడు పముజుల ప్రదీప్‌ను ఎంపీపీ, ఎంపీడీవోలు సత్కరించారు. మండల సభకు పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● ఈఎన్‌సీకి ఉద్యోగ సంఘాల వినతి

నెల్లూరు(హరనాథ పురం,ఆంధ్రజ్యోతి) : జలవనరులు, రోడ్లు - భవనాలు, ప్రజారోగ్యం, పంచాయతీరాజ్ స్టేట్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు బుధవారం విజయవాడ లో ఇంజనీర్ ఇన్ చీఫ్ శేషుకుమార్‌ను కలిశారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి అసోసియేట్ అధ్యక్షుడు ఈ వీఎం శరత్‌బాబు, కళాధర్, ఎస్ నాగరాజు, జీ కొండారెడ్డి, వీ గౌరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలొస్తున్నాయి... అప్రమత్తంగా ఉండండి

● సిటీ కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 15,(ఆంధ్రజ్యోతి) : వర్షాలొస్తున్నందున యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ ఆదేశించారు. బుధవారం నగరంలోని శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో ఆయన పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానిక చేపల మార్కెట్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు మున్సిపల్ వాహనాలకు అందచేయాలని, మార్కెట్లో ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని సూచించారు. అనంతరం రైల్వేస్టేషన్, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాలు, 26, 30, 31 డివిజన్లలో పర్యటించారు. వర్షాలకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

దుకాణాలు తొలగించొద్దు

కొత్తూరు వద్ద రోడ్డు మార్జిన్ వ్యాపారుల దుకాణాలను తొలగించాలని అధికారులు చెప్పడం అన్యాయమని సీఐటీయూ నాయకులు కార్పొరేషన్ కార్యాలయంలో మేనేజర్ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందచేశారు. 30 ఏళ్లుగా రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారని, అంగళ్లు తొలగిస్తే వారి జీవనాధారం పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, కొండా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల్లో సీపీఆర్‌పై అవగాహన

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీపీఆర్ అవగాహన వారంలో భాగంగా బుధవారం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నర్సులు, పారామెడికల్ వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొని అవగాహన కల్పించారు. పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా గురువారం అత్యవసర విభాగం ఎదుట రోగి సహాయకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎన్‌సీసీ నేవీకి విద్యార్థినుల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధ వారం ఎన్‌సీసీ నేవీకి విద్యార్థినుల ఎంపికలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణ రావు మాట్లాడుతూ విద్యార్థినుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ వేదికగా నిలుస్తుందని చెప్పారు. అనంతరం నేవల్ సిబ్బంది విద్యార్థినులకు ఫిజికల్, రాత పరీక్షలు నిర్వహించి అర్హత ప్రమాణాల ఆధారంగా ఎంపికలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేవల్ యూనిట్ కేర్‌టేకర్ డాక్టర్ వై దివ్య, 10ఏ నావల్ సిబ్బంది టీవీ రమణ రావు, వీ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీని బలోపేతం చేయాలి : ఆవాజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైన్స్ అండ్ టెక్నాలజీ రంగా లను బలోపేతం చేయడమే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నిజమైన నివాళి అని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని ఆవాజ్ జిల్లా కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కలాం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ఈ నెలాఖరులో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, సయ్యద్ రఫూఫ్, షేక్ రియాజ్, నగర కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షాహుల్, షేక్ ఫయాజ్, షఫి పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో బుధవారం రాత్రి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, వాస్తు శాంతి, మృత్సంగ్రహణం, రక్షాబంధనం, కంద పవిత్ర సమర్పణం, విశేష హోమం, పూర్ణాహుతి జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ గోపాల కృష్ణ, అంజనీ, మద్దిన విశ్వనాథః, బృంద, భావన, లక్ష్మీ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. కాగా, కొత్తూరు శ్రామికనగర్‌లోని వెంకయ్యస్వామి ఆలయం 22వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డ తండ్రికి జీవిత ఖైదు

50 వేల జరిమానా

నెల్లూరు (లీగల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలికపై కన్న తండ్రే అత్యాచారం చేసి ఆమెకు గర్భం వచ్చేందుకు కారకుడయ్యా డన్న కేసులో నేరం రుజువు కావడంతో ఓ తండ్రికి జీవిత ఖైదుతో పాటు 50వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... జిల్లాలోని జలదంకి మండలం హను మకొండపాళెం గ్రామంలో ఓ కామాంధుడు 2019 జూన్ 24వ తేదీన తన కుమార్తెపైనే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ బాలిక గర్భవతి అయినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జలదంకి పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కిందకేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ చంద్రశేఖర్ వాదించారు.

కంటేపల్లి అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కంటేపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కంటేపల్లిలో బుధవారం కామాక్షిదేవి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నంది, నవగ్రహాల ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌తో కలిసి సోమిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పడమటి గిరిజన కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, తూర్పు గిరిజన కాలనీలో మహాలక్ష్మి ఆలయానికి పూజ కార్యక్రమాలు, ఎస్సీ కాలనీలో చెన్నకేశవస్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. కంటేపల్లిలో మంచి కార్యక్రమాలు చేపట్టిన నియోజకవర్గ జనసేన నేత బోనుబోయిన ప్రసాద్ యాదవ్‌కు, గ్రామస్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు బోనుబోయిన సుగుణమ్మ, సాగునీటి సంఘం అధ్యక్షుడు బోనుబోయిన మాధవయ్య, టీడీపీ నేతలు బొమ్మి సురేంద్ర, కుంకాల నాగేంద్రప్రసాద్, జనసేన నేతలు బోనుబోయిన ప్రసాద్‌యాదవ్, నూనె మల్లికార్జున్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, తదితరులు

గిరిజనుల సమస్యలను పరిష్కరించండి

ముత్తుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అధికారులను కోరారు. కట్టకింద గిరిజన కాలనీవాసుల సమస్యలను బుధవారం ఎంపీడీవో నాగమణి దృష్టికి తీసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వం సర్వేపల్లి నియోజకవర్గంలోని గిరిజన కాలనీల అభివృద్ధి, గిరిజనుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రహీంద, బోలా అశోక్, సందూరి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు భారీ ఊరట

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వలన పేద, మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట లభించిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన రైతులకు యూరియా పంపిణీ, జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి కృషి వలన రాష్ట్రం ప్రగతి బాటలో పరుగులు తీస్తుందన్నారు. రైతుల పక్షపాతి చంద్రబాబునాయుడు యూరియా కొరత లేకుండా చూడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. దీంతో నియోజకవర్గంలోని 70వేల ఎకరాలకు రానున్న సీజన్‌లో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఆనంతరం రైతులకు యూరియా కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ అనిత, టీడీపీ మండల ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్‌రెడ్డి, ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండలాధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



విడవలూరులో రైతుకు యూరియా కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కోవూరు(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పాటూరు గ్రామ టీడీపీ కార్యకర్త పస్నెం శ్రీనివాసులు, వేగూరులో పిడుగుపాటుకు మృతి చెందిన వెంకయ్య, టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, మాచవరం లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆమె వెంట పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, కరేటి అమరావతి తదితరులున్నారు.

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాది

● బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే పునాదులని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సాల్మానుపురంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ నేత రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. రఘురామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రఘుశేఖర్‌రెడ్డి, సయ్యద్ ఆరిఫాల మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, సర్పంచు ఓడా పెంచలయ్య, బత్తల హరికృష్ణ, బీజేపీ నాయకులు మనోహర్‌రెడ్డి, కరేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ ఢీకొనడంతోనే ప్రమాదం

విడవలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గేదెను ఢీకొనడం వద్ద ప్రమాదం జరగలేదని, మోటారు సైకిల్ గుద్దడం వలన ప్రమాదం జరిగిందని చౌకిచర్లకు చెందిన తల్లి పోట్లూరు వనమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. చౌకిచర్ల గిరిజన కాలనీకి చెందిన పొట్లూరు సుమన్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై గాయపడిన సుమన్ తల్లి పోట్లూరు వనమ్మ, చిన్నాన్న సుధాకర్ బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పద్మనాభసత్రంలోని పెట్రోల్ బంకులో పని చేస్తున్న సుమన్ భోజనానికి ఇంటికి వస్తుండగా చౌకిచర్ల సమీపంలో దంపూరుకు చెందిన తండ్రీకొడుకులు బైక్‌పై నెల్లూరుకి వెళుతూ ఢీకొన్నారన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని కోరారు.

కలామ్‌కు ఘన నివాళి

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీఎస్‌యూలో బుధవారం అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాడభూషికి అబ్దుల్ కలామ్ సేవా పురస్కారం

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్‌కు అబ్దుల్ కలామ్ సేవా పురస్కారం లభించింది. పల్నాడు జిల్లాలోని మాచర్లలో బుధవారం అబ్దుల్ కలామ్ సేవా సమితి ఆధ్వర్యంలో మాడభూషికి అబ్దుల్ కలామ్ సేవా సమితి సంస్థాపకులు పాషా వలి చేతులమీదుగా పురస్కారం అందజేశారు.

పెంచలోరి సేవలో మాజీ మంత్రి కాకాణి

రాపూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పెంచలకోన నృసింహుని దర్శించుకున్నారు. ఆయనతో పాటు గోనుపల్లి వైసీపీ నాయకులు నెల్లూరు శివకుమార్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఎస్‌యూ వసతి గృహం తనిఖీ

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలోని పినాకిని పురుషుల వసతి గృహాన్ని బుధవారం వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వసతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్ తదితర వాటిని క్షుణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వీసీ భోజనం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ కోట నీలమణికంఠ, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, రెడ్‌క్రాస్ నిపుణులు డాక్టర్ యశోవాన్, దాసరి రాజేంద్రన్, సుధార్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

● హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వర్లురెడ్డి


కొడవలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో నూతన ఇల్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా ఏఈ హర్షిత, హౌసింగ్ ఇంజనీర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా స్వదేశీ వస్తువులు ఉపయోగించాలి

కోవూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటింటా స్వదేశీ వస్తువులు ఉపయోగించాలని బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కరణం సుభాషిణి కోరారు. స్థానిక రైల్వే ఫీడర్సు రోడ్డులోని కల్యాణ మండపంలో బుధవారం జరిగిన ఆత్మ నిర్భర భారత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసాని శ్రీనివాసులు, జీ.చక్రవర్తి, వీ.రూప్సీ, శశికిరణ్, సీహెచ్ నాగరాజు, డీ.శ్రీనివాసులు, కే.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొన్నూరు పుట్టినరోజు వేడుకలు

మనుబోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడు, మనుబోలు సొసైటీ (పీఏసీఎస్) చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య 71వ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సొసైటీలో టీడీపీ యువనాయకులు పొన్నూరుకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి పొన్నూరుకు తినిపించారు. తరువాత పొన్నూరుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సాని వెంకటరమణయ్య, ఉడతా విజయ్‌కుమార్, సర్వేపల్లి తెలుగుయువత అధ్యక్షుడు రాజాగౌడ్, టీడీపీ యువ నాయకులు యరటపల్లి మహేంద్ర, మోహూరు ధనుంజయ రెడ్డి, కూరపాటి సురేష్, పెనుబాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరుకు కేక్ తినిపిస్తున్న ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

పొదలకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పొదలకూరు ఎస్ఐ ఎస్‌కె ఎండి హనీఫ్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని బాణాసంచా విక్రయ, తయారీ లైసెన్స్ కలిగిన దుకాణదారులు ప్రమాదాల నివారణ కోసం నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం పొదుపు సంఘాలకు అందజేస్తున్న రుణాలను ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని ఈదగాలిలో బుధవారం పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టి ర్యాలీ నిర్వహించారు. పొదుపు మహిళలకు స్త్రీనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు టంగుటూరు హిమల్‌కుమార్‌రెడ్డి, పొదుపు ఏపీఎం రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ చట్టాలపై అవగాహన

మనుబోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు బుధవారం మహిళా రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ ద్వారా సమాచారం ఇస్తే ఆపద నుంచి పోలీసులు కాపాడతారన్నారు. అనంతరం మహిళా రక్షణ చట్టాలపై గోడపత్రికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ. శివరాకేష్, హెచ్ఎం. వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన

సంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బలో ఐసీడీయస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఐసీడీయస్ సూపర్‌వైజర్ సునీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం అధిక పోషక విలువలు ఉండే ఆకు, కాయగూరలను ప్రదర్శించారు.

అబ్దుల్ కలాం జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం


కందుకూరు: అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా బుధవారం పలువురు ఘన నివాళులర్పించారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీసీ కాగితం పునర్వినియోగంతో సంయుక్తంగా కాగితం వ్యర్థాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కే. విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వీ.హరిబాబు, ఒంగోలు ప్రాంతీయ నిర్వాహకుడు కే.నాగేశ్వర రావు పాల్గొన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ఉన్న అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం జీవిత విశేషాలపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వర రావు, సయ్యద్ అహ్మద్‌బాషా, షేక్ రఫీ, షేక్ సలాం, అల్లం వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాదు, తదితరులు అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● **కావలి(టౌన్):** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం జెండా చెట్టు సెంటర్‌లోని కలాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డాక్టర్ ప్రభాకర్‌నాయుడు వైద్యశాల ప్రాంగణంలో పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఎస్‌కె ఖాదర్‌బాషా, దిలీప్‌కుమార్, జమీర్, సలీమ్‌బేగ్, పఠాన్ ఖాదర్‌బాషా, అజిత్‌బాబు, రామచంద్రయ్య పాల్గొన్నారు. అలాగే వెంగళరావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి కోటేశ్వరి అధ్యక్షన జరిగిన కలాం జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పలువురు పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

●**బిట్రగుంట:** బోగోలు మండలం విశ్వనాథ రావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట కూడలిలోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్, మాజీ సైనికుడు విజయప్రతాప్‌రెడ్డి, జిల్లా హూమెన్ రైట్స్ అధ్యక్షుడు దాసరి సునీల్, బొంతా సుధీర్, అహ్మద్ హుసేన్, కొండయ్య, అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆవాజ్ కమిటీ నేతలు పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఆవాజ్ కమిటీ నాయకుడు పి యస్థానీ, సీపీఎం నాయకుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఆధ్వర్యంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా సంగం రాళ్లచెలిక వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల, తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు.

●**దుత్తలూరు (ఉదయగిరి):** దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని విశ్వతేజ పాఠశాల కరస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి

అనంతసాగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని అనంతసాగరం ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. దేవరాయపల్లి బిట్-2లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈనెల 18 వరకు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ఆధార్ నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణరావు పాల్గొన్నారు.


అనంతసాగరం: ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐజాక్ ప్రవీణ్

●**ఆత్మకూరు :** స్థానిక మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అరుంధతీయవాడ సచివాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎస్టీ కులమునకు చెందిన ఆత్మకూరు పట్టణ ప్రజలు ఈ ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచంలో అతిపెద్ద డేటాసెంటర్‌లలో ఒకటిగా, భారత్‌లో తొలి ఏఐ హబ్‌గా విశాఖలో ఏర్పాటు కానున్న ఈ సెంటర్‌ను రాష్ట్రానికి సాధించటంలో రాష్ట్ర ఐటీశాఖా మంత్రి, యువనేత నారా లోకేష్ కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ ప్రాజెక్టు గ్రామీణ ఆర్థికవ్యవస్థను, వ్యవసాయాన్ని విద్య వైద్యరంగాలను బలోపేతం చేస్తుందని తెలిపారు.

గూగుల్ రాకతో రాష్ట్రాభివృద్ధి : కాకర్ల

●**ఉదయగిరి:** గూగుల్ రాకతో రాష్ట్రం అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఉదయగిరి శాసనసభ్యుడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీని ద్వారా రెండు లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సాంకేతిక రంగంలో వినూత్న మార్పులు చోటుచేసుకొని రాష్ట్రం దేశంలోనే సాంకేతికపరంగా అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. గూగుల్ సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీశాఖా మంత్రి నారా లోకేష్‌బాబులకు ఆయన ఈసందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చేతుల శుభ్రతతో అంటువ్యాధుల నివారణ


కావలి(టౌన్): చేతుల పరిశుభ్రత కార్యక్రమంలో మాట్లాడుతున్నమున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి(టౌన్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతుల శుభ్రంతో అంటువ్యాధులను అరికట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేని పురస్కరించుకుని మెప్మాఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చేతుల పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సచివాలయం ఏఎన్‌ఎమ్‌లు మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మెప్మా సీఎంఎం శ్రీహర్షిత చేతులు పరిశుభ్రత చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు ఆనం కైవల్యారెడ్డి, ఆర్డీవో బి పావని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, మెప్మా సీవో మాధవి, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండలంలోని ఎస్‌ఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేక యాప్

● **ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్వీ రమణమ్మ**


మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్వీ రమణమ్మ

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం నాణ్యతను గుర్తించడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఆర్‌వి రమణమ్మ తెలిపారు. బుధవారం ఆమె ఆత్మకూరు ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకుని మద్యం బాటిల్‌ను స్కాన్ చేస్తే మద్యం నాణ్యత తెలుసుకోవచ్చన్నారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎం శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాసులునాయుడు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను ప్రతి ఒక్కరు ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని, అక్రమంగా మద్యం అమ్మితే 9440902525 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. బెల్టుషాపులు, నాటుసారా అక్రమంగా అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.. మద్యం నాణ్యత తెలుసుకోండి

● **ఉదయగిరి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మద్యం నాణ్యత తెలుసుకోవచ్చని ఉదయగిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ టీ లక్ష్మణస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు, సీతారామపురం మండలాలకు చెందిన మద్యం దుకాణాల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార మద్యం విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే 9440902522 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు దీప్తికరంత్, శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఉపయోగించుకోవాలి

కావలి/కందుకూరు అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో కొనుగోలు చేసిన మద్యం బాటిళ్లు సురక్షితమైనవో కాదో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టిందని కావలి, కందుకూరు ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి సర్కిల్ పరిధిలో ఉన్న కావలి పట్టణం, కావలి రూరల్, జలదంకి, బోగోలు మండలాల్లోని మద్యం వినియోగదారులు ఈ యాప్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనే ధ్యేయం

● **మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె కైవల్యారెడ్డి**


దత్తత తీసుకున్న బొమ్మిరెడ్డి బాలుకు చెక్కును అందజేస్తున్న ఆనం కైవల్యారెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన పీ-4 కార్యక్రమం పేదల అభివృద్ధికి బంగారు బాటలు వేస్తుందని, ఆయన ఆశయ సాధనే ధ్యేయమని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె ఆనం కైవల్యారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఆర్డీవో బి పావని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బండారుపల్లికి చెందిన బొమ్మిరెడ్డి మల్లేశ్వరి కుటుంబానికి మార్గదర్శిగా దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల తన తండ్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు పర్యటనలో పాలిటెక్నిక్ చదువుతున్న బొమ్మిరెడ్డి బాలు తనకు ప్రమాదవశాత్తు కోల్పోయిన కుడి కాలుకు ప్రత్యామ్నాయంగా కృత్రిమ జైపూర్ కాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, మంత్రి ఆనం ఆ విద్యార్థి యోగక్షేమాలు చూసుకుంటానని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారని, ఈక్రమంలో తన తండ్రి సూచనల మేరకు బొమ్మిరెడ్డి బాలు కుటుంబాన్ని దత్తత తీసుకున్నానని పేర్కొన్నారు. అనంతరం ఆమె బొమ్మిరెడ్డి బాలు కుటుంబానికి చెక్కును అందజేశారు. ముందుగా ఆర్డీవో బి పావని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు షేక్ గౌస్‌బాష, కొప్పోలు రమాదేవి, సూరా భాస్కర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి పాల్గొన్నారు.

యూరియా కార్డుల పంపిణీపై అవగాహన

బిట్రగుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం మండల వ్యవసాయ అధికారిని బీశైలజ ఆధ్వర్యంలో యూరియా కార్డుల పంపిణీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి సీహెచ్.నాగరాజు హాజరై యూరియా కార్డుల పంపిణీ గురించి రైతులు, ఎరువుల డీలర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, నాగులవరం పీఏసీఎస్ ఛైర్మన్ చిలకపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ లక్కాకుల మాధవరావు, రైతు నేతలు కోటా వెంకారెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

75శాతం హాజరు ఉన్నవారికే కుట్టు మిషన్లు


కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలతో బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, తదతరులు.

కలువాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శిక్షణా తరగతుల్లో 75 నుంచి 80 శాతం హాజరు ఉన్న మహిళలకే కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ నిర్మలాదేవి స్పష్టం చేశారు. బుధవారం కలువాయిలో కుట్టు శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో 75శాతం హాజరు ఉన్న మహిళలకు ఒక పరీక్ష నిర్వహించి అనంతరం వారికి మిషన్లు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, జగదల్ నాయుడు, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు దండు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబను దర్శించుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ తల్లిని బుధవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల బీజేపీ ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకపాటి మాల్యాద్రినాయుడు, కదిరి వెంకటరంగరావు, చీదర్ల శివపార్వతి, చుండి హరిగోపాల్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు, ఆవుల రోశయ్య, వెంకటస్వామి, ఈశ్వర్‌రెడ్డి, జీ.వెంకటేశ్వర్లు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ చెర్మన్‌గా మండవ

మర్రిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నమాచునూరులోని వీరాంజనేయస్వామి ఆలయ నూతన చెర్మన్‌గా మండవ సుబ్బరాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోవూరు డివిజన్ ఎండోమెంట్ అధికారి నాగమల్లేశ్వరరాజు ఆయనతో ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పావులూరి వెంకటరామయ్య, ఈశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

సంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఐసీడీయస్ సూపర్‌వైజర్ సునీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

ఉదయగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.తులసీరామ్ బుధవారం సీఐటీయూ నాయకులతో కలిసి డిపో మేనేజర్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్య, యస్థానీ, వెంకటేశ్వర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఈ-పంట నమోదు చేయాలి

ఉదయగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో వీఆర్వోలు, వీఏఏలు సమష్టిగా పనిచేసి నూరు శాతం ఈ-పంట నమోదు చేయాలని తహసీల్దారు ఎల్ రామ్మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌తో కలిసి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోపు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. మండలంలో అర్హులైన కౌలు రైతులకు కార్డులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటీ షాజియా, ఏఎస్‌వో సుమ, వీఆర్వోలు, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 975 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 605 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 370 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 315కాగా, కనిష్ఠ ధర రూ. 65 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.



ములకలచెరువులో కల్తీ మద్యం తీగ లాగితే.. రాష్ట్రమంతా కదిలింది. దీనిపై ప్రభుత్వం సిట్‌నూ వేసింది. అదే సమయంలో నకిలీ మద్యం గుట్టు విప్పడానికి ప్రభుత్వం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. బాటిల్‌పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా అసలా.. నకిలీనా అనేది గుర్తించొచ్చు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నకిలీ మందు గుట్టు ఇక రట్టు



- స్కాన్ చేయి.. వివరాలు తెలుసుకో
- అందుబాటులోకి ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్

కల్తీ మద్యంను రట్టు చేయడానికి ప్రభుత్వం 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను తీసుకొచ్చింది. దీనిని తిరుపతిలోని అర్బన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో బుధవారం సీఐ రామచంద్రతో కలిసి జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. ఈ యాప్‌ను ఎలా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. కల్తీ మద్యం అరికట్టేందుకు.. మరోవైపు లిక్కర్ షాపులు, బార్ల వద్ద నాణ్యమైన మద్యం విక్రయాలకు ఈ యాప్ దోహదపడనుంది. మద్యం బాటిల్ మీద వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతనే మద్యం విక్రయించాలి.

యాప్‌ను ఇలా వాడాలి

● సెల్‌ఫోనులోని ప్లే స్టోర్‌కు వెళ్ళి 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ● ఇన్‌స్టాల్ చేశాక రెండు ఎంపికలు కనిపిస్తాయి. ఒకటి వినియోగదారుల కోసం, మరొకటి మద్యం దుకాణాల నిర్వాహకుల కోసం. ● వినియోగదారుడు ఐఎంఎల్ లిక్కర్ బాటిల్‌పై వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. ఆ తర్వాత వెరిఫై ప్రొడక్టును ఎంపిక చేయగానే మద్యం బాటిల్‌పై ఉన్న బ్యాచ్ నెంబరు, ఎక్కడ తయారైంది? ఎటు నుంచి వచ్చింది? బ్రాండు పేరు, ధర వివరాలన్నీ స్ర్కీన్‌పై డిస్‌ప్లే అవుతుంది. ఒకవేళ అది నకిలీ మద్యం అయితే 'డిటైల్స్ నాట్ ఫౌండ్' అని కనిపిస్తుంది. ● ఈ యాప్‌లోని సమాచారం జిల్లా క్షేత్రంలోని అధికారులకు, రాష్ట్ర స్థాయి అధికారుల డేటా బేస్‌కు వెళుతుంది.



ఇక, అబద్ధ ప్రచారం చేయలేరు

ఇకపై మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉందనే అపోహలు, వదంతులు సృష్టించలేరు. ప్రభుత్వం, డిపార్టుమెంటుపై అబద్ధాలు ప్రచారం చేసే అవకాశాలు ఉండవు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అసలు మద్యం కొనుగోలు చేయాలి. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవు.

- నాగమల్లేశ్వర రెడ్డి, ఎక్సైజ్ ఈఎస్

వికలాంగ పింఛనుకు ఈయన అర్హుడు కారా?

- ఆరేళ్లుగా ఎదురు చూపు
- రెండు నెలల కిందట వృద్ధాప్య పెన్షన్ మంజూరు



మంచంలోనే ఉంటున్న నాగరాజు

ఏర్పేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రెండు కాళ్లు లేవు. నడవలేరు. ఆరేళ్లుగా మంచానికే పరిమితమయ్యారు. అయినా, ఆయనకు వికలాంగ పింఛను రాలేదు. ఈ విషయంలో వైసీపీ ఐదేళ్ల వైసీపీ పాలనలో 'రాజకీయం' చోటుచేసుకుంది. ఇప్పుడేమో అధికారులు వృద్ధాప్య పింఛనుతో సరిపెట్టారు. ఈయన పేరు నాగరాజు. ఉండేది ఏర్పేడు మండలం రావిళ్లవారికండ్రిగ అరుంధతివాడ. ఆరేళ్ల క్రితం ఇన్ఫెక్షన్ సోకడంతో శస్త్రచికిత్స ద్వారా రెండు కాళ్లను తొలగించారు. అప్పట్నుంచి నెలకు రూ.10వేలు మందులకు ఖర్చవుతోంది. రెండు కాళ్లలేక ఏ పనీ చేయలేదక కుటుంబ సభ్యులపై ఆధారపడ్డారు. అప్పటి నుంచి వికలాంగ పింఛను కోసం కుటుంబ సభ్యుల సహకారంతో అధికారుల చుట్టూ తిరిగారు. టీడీపీ సానుభూతిపరుడని గత వైసీపీ పాలనలో ఆయనకు పింఛను రాకుండా అడ్డుకున్నారని సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ దరఖాస్తు చేశారు. మే నెలలో ఆయనకు వెంకటగిరిలోని సదరం క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించగా.. రెండు కాళ్లు లేవని 99 శాతం వికలత్వం ఉన్నట్లు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అయినా ఆయనకు వికలాంగ పింఛను రాలేదు. కానీ, రెండు నెలల కిందట వృద్ధాప్య పింఛను మంజూరైంది. దీనిపై ఆవేదనతో ఆయన తొలి నెల పింఛను తీసుకోలేదు. కానీ, మందుల ఖర్చు భరించలేని పరిస్థితుల్లో రెండో నెల పింఛను తీసుకున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వికలాంగ పింఛను అందిస్తే.. మందులకు ఊరటగా ఉంటుందని ఆయన అన్నారు.



గోడౌన్‌లో నుంచి బ్యాంకు గోడకు వేసిన కన్నం

బ్యాంకు దోపిడీకి 'పక్కా' ప్లాన్ వేశారు. ఈ భవనానికి.. వెనక గోడౌన్‌కు మధ్యలో ఉన్నది ఒకటే గోడ. దీంతో గోడౌన్‌లోకి చొరబడిన దుండగులు.. గోడకు కన్నం వేసి వేసి బ్యాంకులోకి దూరారు. చోరీకి విఫలయత్నం చేసి వెనుదిరిగారు.



బ్యాంకు దోపిడీకి 'వెనుక' ప్లాన్

- గోడౌన్‌లో నుంచి కన్నం వేసిన దుండగులు
- నాగలాపురం యూబీఐలో చోరీకి విఫలయత్నం



పోలీసులు విడుదల చేసిన నిందితుల ఊహా చిత్రం



బ్యాంకులో విచారిస్తున్న పోలీసులు

నాగలాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని యూనియన్ బ్యాంకుకు మంగళవారం రాత్రి కన్నం వేశారు. చోరీకి యత్నించి విఫలమయ్యారు. ఈ విషయం బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. యూనియన్ బ్యాంకుకు వెనుకవైపు సిమెంట్ గోడౌన్ ఉంది. ఇద్దరు దుండగులు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో సిమెంట్ గోడౌన్ షట్టర్‌ను ధ్వంసంచేసి లోనికి ప్రవేశించారు. గోడౌన్ లోపల నుంచి బ్యాంకు భవనం గోడకు మనిషి దూరే కన్నం వేశారు. లోపలకు వెళ్లిన వీరు ముందుగా సీసీ కెమెరాలను, అలారం సెట్‌ను తొలగించారు. సిమెంట్ గోడౌన్‌లో విద్యుత్ సరఫరా లేకపోయే సరికి బ్యాటరీ కటింగ్ మిషన్ ద్వారా కన్నం వేసినట్లు తెలుస్తోంది. బ్యాంకు లోపల లాకరును తెరిచేందుకు రాత్రంతా ప్రయత్నించారు. ఆ ప్రయత్నం సఫలం కాకపోవడం.. తెల్లవారుతుండడంతో దుండగులు వెనక్కి వచ్చారు. బ్యాంకు లోపల సీసీ టీవీ, డీవీఆర్ బాక్సులు, హార్డ్ డిస్క్‌లను తీసుకెళ్లారు. బుధవారం ఉదయం విధులకు వచ్చిన బ్యాంకు సిబ్బంది దీనిని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సత్యవేడు ఎస్‌ఐ రామస్వామి, టీఎస్‌ఐ ప్రసాద్ పరిసరాలను పరిశీలించారు. విచారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ చెప్పారు. ఘటన జరిగిన సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు నిందితుల చిత్రాలను పోలీసులు విడుదల చేశారు.

గతంలోనూ ఇదే తరహా చోరీలు

గతంలోనూ ఓ దొంగల ముఠా నాగలాపురంలో ఇదే తరహాలో చోరీకి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. బట్టల దుకాణం,నగల దుకాణం, ఏటీఎం కేంద్రాల్లో చోరీకి పాల్పడ్డారు. ప్రస్తుతం ఏకంగా బ్యాంకుకే కన్నం వేశారు.

గ్రావెల్ లేక ఆగిన 'సాగరమాల'

- నేడు కోటకు కలెక్టర్ రాక

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్ అందుబాటులో లేక కోట మండలంలో సాగరమాల రోడ్డు పనులు వారం రోజులుగా ఆగిపోయాయి. గ్రావెల్ క్వారీల రాయల్టీ నగదును ప్రభుత్వానికి చెల్లించే బాధ్యతలను ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీంతో కోట, చిల్లకూరు మండలాల్లో సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ సరఫరా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సాగరమాల ప్యాకేజీ 4లోని 31 కిలోమీటర్ల రోడ్డు పనులను గురువారం పరిశీలించనున్నారు. తమ్మినపట్నం, కొత్తపట్నంలోని క్రిస్ సిటీ పనులను కలెక్టర్ పరిశీలించి, ఆయా పనులకు అవసరమయ్యే గ్రావెల్ రవాణా అనుమతుల విషయమై మైనింగ్ అధికారులతో చర్చించనున్నట్లు మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు.

స్కూల్ బ్యాగ్‌లో మద్యం

- టీచర్లు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

చంద్రగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మద్యం తాగొచ్చిన విద్యార్థిని ఉపాధ్యాయులు మందలించగా.. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఎం.కొంగరవారిపల్లె ఉన్నత పాఠశాలలో సమీప గ్రామానికి చెందిన ఓ విద్యార్థి పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం ఇతడు మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. ఈ విషయాన్ని తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పారు. అతడి స్కూల్ బ్యాగ్‌ను ఉపాధ్యాయులు తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు కనిపించడంతో హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆ విద్యార్థిని హెచ్‌ఎం మందలించి, పాఠశాలకు రావాలంటూ 11 గంటల సమయంలో అతడి తల్లితండ్రులకు సమాచారమిచ్చారు. ఇంతలో ఆ విద్యార్థి పాఠశాల ప్రహరీ దూకి పరారయ్యాడు. అతడి కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు చుట్టు పక్కల గాలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముంగిలిపట్టు సమీపంలో రైలు పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. అక్కడికి వెళ్లి పరిశీలించగా, చనిపోయింది ఆ విద్యార్థేనని నిర్ధారించారు. రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగి సస్పెన్షన్



చంద్రశేఖర్ వెంకటేష్

- కల్తీ మద్యం అని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు
- ఎమ్మెల్సీ సిపాయి పీఏగా పనిచేస్తున్న వెంకటేష్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నకిలీ మద్యం అంటూ సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు పెట్టించిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్సీ పీఏ, రెవెన్యూ ఉద్యోగి చంద్రశేఖర్ వెంకటేష్ సస్పెండయ్యారు. ఇతడిపై కేసు నమోదవడంతో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన్ను సస్పెండ్ చేశారు. నారాయణవనం తహసీల్దారు కార్యాలయంలో చంద్రశేఖర్ వెంకటేష్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌పై వైసీపీ ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం దగ్గర పీఏ (వ్యక్తిగత సహాయకుడు)గా చేరారు. ఈ నెల 7న కొంత మంది వైసీపీ సోషల్ మీడియా సభ్యులతో కలిసి 'తిరుపతిలో కల్తీ మద్యం కలకలం.. ప్రజల భద్రత ఎక్కడ', 'ఎస్ బ్రాండ్ మద్యం తాగి అపస్మారకస్థితిలో వ్యక్తి' అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేయించారు. ఎక్సైజ్ పోలీసుల ఫిర్యాదుతో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదుచేశారు. తప్పుడు పోస్టులతో అసత్య ప్రచారాలుచేసిన చంద్రశేఖర్ వెంకటేష్‌తో పాటు నవీన్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 41ఏ నోటీసు ఇచ్చి పంపారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన చంద్రశేఖర్ వెంకటేష్ ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారంచేయడంతో చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు కలెక్టర్‌కు నివేదిక పంపారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాకు హంద్రీ-నీవా జలాలు

- రూ. 126 కోట్లు మంజూరుచేస్తూ జీవో జారీ
- సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే నానీ కృతజ్ఞతలు

తిరుపతి/చంద్రగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి హంద్రీ-నీవా జలాలను మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.126.06 కోట్లు మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు ఏర్పాటు చేసిన నీవా బ్రాంచి కెనాల్ నుంచీ చంద్రగిరి, తిరుపతి, తిరుమల వరకూ నీటిని మళ్ళించేందుకు జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఫిబ్రవరి 8, మార్చి 5వ తేదీల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.127 కోట్ల అంచనా వ్యయంతో చంద్రగిరి మండలం నారావారిపల్లి సమీపంలోని మూలపల్లి చెరువుకు, అక్కడి నుంచీ మరో నాలుగు చెరువుల మీదుగా కళ్యాణి డ్యామ్‌కు మళ్ళించేలా డిజైన్ రూపొందించారు. మార్గమధ్యంలో 1154 ఎకరాలకు సాగునీరందించడానికి కూడా ప్రతిపాదించారు. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడును పలుమార్లు కలిసి ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. దీంతో ఈ నెల 3న జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆమోదం లభించింది. తాజాగా జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సంబంధిత పనుల కోసం రూ.126.06 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 'నా ఎన్నికల హామీని నెరవేర్చేందుకు సాయం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్నా' అని బుధవారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నానీ ఆంధ్రజ్యోతితో అన్నారు. మిగిలిన హామీలను నెరవేర్చేందుకూ కృషి చేస్తానన్నారు.

'సర్క్యులర్ ఎకానమీ'పై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య


- కాలుష్య నియంత్రణమండలి చైర్మన్ కృష్ణయ్య సూచన

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సర్క్యులర్ ఎకానమీపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య సూచించారు. రాష్ట్ర సర్క్యులర్ ఎకానమీ- వేస్ట్ రీసైక్లింగ్ పాలసీపై కలెక్టరేట్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రతి వస్తువును వ్యర్థంగా కాకుండా వనరుగా చూడాలన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రీసైక్లింగ్ పాలసీని రూపొందించిందన్నారు. చికెన్, చేపల దుకాణాల్లో వచ్చే వ్యర్థాలను ఫిష్ మీల్, ప్రొటీన్ ఫీడ్‌గా, రొయ్యల వ్యర్థాల నుంచి కైటిన్ అనే విలువైన పదార్థం తీసి ఆరోగ్య ఉత్పత్తుల్లో వాడుతున్నారని వివరించారు. సర్క్యులర్ ఎకనామీ అంటే వ్యర్థమే అనేది ఉండకూడదని, ప్రతి వస్తువును తిరిగి వాడటమన్నారు. దాని వల్ల ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతాయన్నారు. ముఖ్యంగా వెటర్నరీ, అగ్రికల్చరల్ యూనివర్శిటీలలో పౌల్ట్రీవేస్ట్, వ్యవసాయ వ్యర్థాలపై పరిశోధన చేసి రైతులకు ఉపయోగపడే మోడల్స్‌ను సృష్టించాలన్నారు. శ్రీకాళహస్తి-నాయుడుపేట జాతీయ రహదారిలో పొయ్య వద్ద, వీసీఐసీ మార్గంలో సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మౌర్య, కాలుష్యనియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్, నాగేశ్వరరాజు, డీపీవో సుశీలదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, ఆంధ్రజ్యోతి: తిరుమల శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గాన కోకిల జ్ఞాపకాల్లో....



హైదరాబాదులో బుధవారం కన్నుమూసిన తొలి తరం సినీ నటి, నేపథ్య గాయని రావు బాలసరస్వతికి తిరుపతితో మంచి అనుబంధమే వుంది.చెన్నైలో వున్నప్పుడు అనేకమార్లు తిరుపతికి వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు.వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ అనేక పాటలు పాడారు.వెంకటగిరి రాజవంశంలో పుట్టి తూర్పుగోదావరి జిల్లా కోలంక జమిందారు ఇంటికి దత్తు వెళ్లిన రావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావును 1944వ సంవత్సరంలో వివాహమాడారు.2007లో తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాలతో పాటు 2009లో శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరై సన్మానాలందుకున్నారు.రావు బాలసరస్వతి మృతి పట్ల వెంకటగిరి రాజ వంశీకుడు, గేయధారతో ప్రఖ్యాతుడైన సాయికృష్ణ యాచేంద్ర సంతాపం వ్యక్తం చేశారు.1950వ సంవత్సరంలో వెంకటగిరిలో జరిగిన తన గేయధార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారని గుర్తు చేసుకున్నారు.

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలలో రావు బాలసరస్వతిని సన్మానిస్తున్న నాటి తెలుగు అధ్యాపకుడు సాకం నాగరాజ



తిరుపతిలో నిర్వహించిన తెలుగు భాషా బ్రహ్మోత్సవాల్లో రావు బాలసరస్వతి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి: కురుగొండ్ల


గుండెపోటు ఇంజక్షన్‌ను చూపుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ప్రధాన వైద్యాధికారి జిలానీ బాషా ఆస్పత్రి బయట తిరుగుతుండడాన్ని గమనించిన ఎమ్మెల్యే ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు వైద్యం అందించకుండా బయట ఎందుకు ఉన్నారని నిలదీశారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగులకు మొక్కుబడిగా వైద్యం అందించి రెఫర్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకపై అలా జరగడానికి వీల్లేదని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వెంకటగిరిలో త్వరలో డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. గుండెపోటుకు సంబంధించి రూ.45వేల విలువ చేసే అత్యవసర ఇంజెక్షన్లు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తీసువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివారెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ డానియెలీ పరిశ్రమకు పలు అవార్డులు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

సత్యవేడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ కన్వర్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (సీఓఓ) పోటీల్లో అత్యున్నత నాణ్యత పనితీరుకు గాను శ్రీసిటీలోని డానియెలీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్, సిల్వర్ అవార్డులను గెలుచుకుంది. దీంతో పాటు విశిష్ట నాయకత్వ ప్రతిభకు డానియెలీ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావుకు ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన సామర్థ్యం, దార్శనికత, నాయకత్వ లక్షణాలకు ఈ అవార్డు వరించింది. ఈసందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. ఇది శ్రీసిటీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. డానియెలీ సిబ్బంది, యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత డానియెలీ గ్రూపునకు చెందిన శ్రీసిటీలోని డానియెలీ పరిశ్రమ నాణ్యతతో కూడిన స్టీల్ ప్లాంటు మెషినరీ, రోలింగ్ మిల్స్ వంటి పరికరాలను తయారు చేస్తోంది. ఈ విజయంతో శ్రీసిటీ ప్రాంతం వినూత్న పారిశ్రామిక ఆవిష్కరణకు నాయకత్వ కేంద్రంగా ఎదుగుతోందని స్పష్టం చేస్తోంది.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

బాలాయపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బాలాయపల్లిలో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి జీఎస్టీ తగ్గింపు గురించి వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు మాట్లాడుతూ నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రెండు శ్లాబులుగా సంస్కరించిందన్నారు. దీనివల్ల అన్నివస్తువుల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, ఏఎంసీ డైరెక్టర్ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, మద్దూరు కృష్ణ, మావిళ్లపల్లి మాధవ నాయుడు, పులకంటి మురళి, తాళ్ల వెంకటేష్, మారెళ్ల వెంకటాద్రి, గుండుబోయిన గోపాల్, ఆర్కాటి ప్రసాద్, జడపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిద్దాం: మేరిగ

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ముందుకురావాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీ అన్నారు. మండల పరిధిలోని జరుగుమల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీల్లో బుధవారం కోటి సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, ప్రసాద్‌గౌడ్, కస్తూరయ్య యాదవ్, రాఘవరెడ్డి, సురేంద్ర, జగదీష్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన పెంచుకొంటే నిండు ప్రాణాన్ని రక్షించుకోవచ్చునని ప్రముఖ వైద్యుడు సాయిరాం అన్నారు. బుధవారం స్థానిక విక్రమ్ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అపస్మారస్థితిలోకి వెళ్లిన వారికి సీపీఆర్ చేయడం ద్వారా బతికించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు దవ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణాకుమారి

నాయుడుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యాభ్యాసం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణాకుమారి అన్నారు. బుధవారం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధ్యాపకులు, మంచి నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తారని, విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలన్నారు. జూనియర్లకు సీనియర్లు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ విజయ్‌కుమార్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ఎంఈవో మునిరత్నం అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య పనులపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై దృష్టి సారించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంఈవో వెంట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దుస్తులు, టపాకాయలు, స్వీట్స్ బాక్స్ అందజేశారు. పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాలు నిర్వహించి ఎంఈవో సునీల చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, ఆలపాటి అశోక్ కుమార్, సాయిరాం, ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రశేఖర్, ఉపాధ్యాయులు సుజాత, ఉషారాణి, కళాచిత్ర ట్రస్టు సభ్యుడు ఆర్ఎంస్ బాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

నాయుడుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సీఎస్ తేజ సెంటర్‌లో టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం గురువారం భూమిపూజ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ రఫీ పర్యవేక్షించారు.

రేకులషెడ్డు నుంచి పడి కూలీ మృతి

చిల్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ రేకులషెడ్డు మీద నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కూలీ మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. నెల్లూరు వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన శ్రీహరి (27) చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో లక్ష్మీనారాయణ అనే వ్యక్తి నిర్మిస్తున్న రేకులషెడ్డు వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించినా సాయంత్రానికి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని వర్షం పడింది.


అధ్వానంగా ఉన్న వావిళ్లపాళెం నుంచి తూపిలిపాళెం వెళ్లే రోడ్డు - గుంతలు పడి రాళ్లు తేలిన రావిగుంటపాళెం రోడ్డు

అధ్వాన రోడ్లపై అవస్థల ప్రయాణం

వాకాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వావిళ్లపాళెం నుంచి తూపిలిపాళెం వెళ్లేందుకు మూడు కిలోమీటర్ల రోడ్డులో అరగంట ప్రయాణం చేయాల్సి వస్తోంది. రోడ్డుపై గుంతలుపడి కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తూపిలిపాళెం సమీపంలో పెద్దసంఖ్యలో హేచరీలు, రొయ్యల చెరువులు ఉండడంతో వాహనాలు రాకపోకలతో రోడ్డు అధ్వానంగా తయారైంది. రావిగుంటపాళెం నుంచి నిడిగుర్తి మీదుగా వేణుగోపాలపురం, చిన్నతోట, మనపాళెం, పూడిరాయదొరువు, నవాబుపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరు తేలడంతో 18 కిలోమీటర్ల దూరానికి రెండు గంటలు ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. దుగరాజపట్నం, కొత్తూరు వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతిని వర్షపునీరు చేరడంతో గంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వాకాడు నుంచి వెంకటరెడ్డిపాళెం హరిజనవాడ రోడ్డు దెబ్బతింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

అధికారుల, నాయకుల సమన్వయంతోనే అభివృద్ధి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధికి బాటలు పడతాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొదట విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, వెలుగు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, గృహనిర్మాణం, ఉద్యానవన శాఖల పనితీరుపై సమీక్షించారు. అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులు, నిర్దేశించిన లక్ష్యాలను వివరించారు. పలువురు నాయకులు తమ పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమన్వయంతో అందరూ కలసి పనిచేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు అభివృద్ధి సాధించడం సులభతరమౌతుందన్నారు. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని, రెవెన్యూశాఖ ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పెద్దఎత్తున అవగాన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలువురు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో నారాయణరెడ్డి, తహసీల్దారు పద్మావతి, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, కుందాం, కురుగొండ సొసైటీ చైర్మన్లు పురుషోత్తంరాజు, అంకయ్య, బీసీ, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కే ఖలీల్, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, మాచవరం క్లస్టర్ ఇన్‌చార్జి పాదర్తి ప్రకాష్ నాయుడు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఇస్రో మాజీ ఉద్యోగి ఎల్‌శ్రీనివాసులు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం కలాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగానే కాకుండా అరుదైన గొప్ప వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడని కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు సరికొత్త దిశను చూపించారని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకుపోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులచే సైన్సు ప్రాజెక్టులు ఏర్పాటు చేసి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, షార్ మాజీ ఉద్యోగి శ్యామ్ సుందర్, పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు ఉస్మాన్ బాషా, దుష్యంత్, శ్రీకుమార్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక జనసేన కార్యాలయంలో అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కలలు కనండి... వాటిని సాకారం చేసుకోండి అని యువతకు గొప్పసందేశాన్ని అందించిన మహానుభావుడని, ఆయన సూచించిన మార్గంలో యువత నడుస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున, వంశీకృష్ణ, సాయికిరణ్, విజయ్, శ్రీను, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.


కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు సురక్షా యాప్

సూళ్లూరుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సురక్షా యాప్ అందుబాటులోకి తెచ్చిందని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలిపారు. బుధవారం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించి సురక్ష యాప్‌పై అవగాహన కల్పించారు. మద్యం బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన తరువాత అమ్మకాలు కొనసాగించాలని ఆదేశించారు. ఈ యాప్ ద్వారా స్కాన్ చేసి మద్యం తయారీ కంపెనీ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ అరుణకుమారి అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కల్తీ మద్యాన్ని నిర్మూలించడంలో భాగంగా ఎక్సైజ్ సురక్ష యాప్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. మద్యం దుకాణాల్లో ప్రతి మద్యం సీసాను యాప్ ద్వారా స్కాన్‌చేసి మాత్రమే విక్రయించాలని ఆదేశించడం జరిగిందన్నారు.


ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన

వాకాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల మద్యం దుకాణ నిర్వాహకులకు ఎక్సైజ్ సురక్ష యాప్‌పై సీఐ ప్రసాద్ అవగాహన కల్పించారు. కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఆవిష్కరించిందన్నారు. మద్యం విక్రయించేటప్పుడు ప్రతి బాటిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేసి అమ్మకాలు జరపాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మ సాగుపై రైతులకు అవగాహన

గూడూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపాళెం గ్రామంలో బుధవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిమ్మ సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో డాక్టర్ తిరుపాల్, సునీత, గోపినాయక్, మణికంఠస్వామి, ప్రసాద్, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

పేటశ్రీ‘ తిరుపతి కథలకు’ తెలుగు వర్సిటీ పురస్కారం



పేట శ్రీనివాసులురెడ్డి - తిరుపతి కథలు పుస్తకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేట శ్రీనివాసులురెడ్డి రాసిన ‘తిరుపతి కథలు’ పుస్తకానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఏటా ఈ అవార్డులను ప్రకటిస్తారు. 2023 సంవత్సరానికి గాను వచనరచనల విభాగంలో పేట శ్రీనివాసులురెడ్డికి ఈ పురస్కారం లభించింది. ఈనెల 29వ తేదీన హైదరాబాదు నాంపల్లిలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు. ఎస్వీయూ తెలుగు విభాగం రిటైర్డు ప్రొఫెసర్ అయిన ఈయన 2014లోనూ తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఇప్పటికే 20 పురస్కారాలను అందుకున్న పేటశ్రీ 25 పుస్తకాలు, 300 వ్యాసాలు రాశారు. 10 దేశాల సదస్సుల్లో పాల్గొన్నారు.

పోక్సో కేసులో రిమాండ్

బాలాయపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. నిందితుడిని వెంకటగిరి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి డిమాండ్

తిరుపతి(జీవకోన), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి చాటుకోవాలని మాజీ మంత్రి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. తిరుపతిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కిందిస్థాయి కార్యకర్తలతో ప్రభుత్వాన్ని నడిపేలా జగన్‌మోహన్‌రెడ్డి సందేశం ఇచ్చారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి జగన్, పెద్దిరెడ్డే అంతా చేశారని తాను సిట్ విచారణలో చెప్పలేదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. అనంతరం భూమన నివాసం వద్ద రోడ్డుపై బైఠాయించి మద్యం కుంభకోణాన్ని సీబీఐకి అప్పగించాలంటూ ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలోనూ ప్రభుత్వంపై పెద్దిరెడ్డి, భూమన విమర్శలు చేశారు. టీడీపీలో తమకెవరూ కోవర్టులు లేరని చెప్పారు.


ధర్నాలో పెద్దిరెడ్డి, భూమన తదితరులు

గూగుల్‌తో ఒప్పదం.. రాష్ట్రాభివృద్ధిలో కీలక మలుపు


సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పదం కుదుర్చుకోవడం రాష్ట్రాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో కీలక మలుపు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంతో గుర్తింపు పొందిన గూగుల్ సంస్థ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేసేలా మంత్రి నారా లోకేశ్, సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేశారన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రంలోని 2 లక్షల మంది యువతకు ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచకపాలనను తట్టుకోలేక రాష్ట్రంలో ఉన్న పలు కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోవడం జరిగిందన్నారు. సమర్థత కలిగిన నాయకత్వం ఉంటే ఏదైనా సుసాధ్యం చేయవచ్చునని ఎన్డీఏ ప్రభుత్వం చేసి చూపుతోందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెందురామయ్య, చంద్రమౌళి, గుండాల లీలావతి, ఇశ్రాయిల్ కుమార్, పెంచలయ్య, వెంకటేశ్వర్లురాజు, వేముల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీభారత్ ట్రస్టు సేవలు అభినందనీయం


వెంకయ్యనాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొమారి కోటేశ్వరరావు

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటకు చెందిన శ్రీభారత్ ట్రస్టు సేవలు అభినందనీయమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో బుధవారం శ్రీభారత్ ట్రస్టు చైర్మన్, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. కోట, వాకాడు మండలాల్లోని గోవిందపల్లిపాళెం, తూపిలిపాళెం, కొండూరుపాళెం గ్రామాల్లో 3 విద్యావికాశ కేంద్రాలు శ్రీభారత్ ట్రస్టు ద్వారా నడుస్తున్నాయని, ఈ నెలలో మరో రెండు పాఠశాలలు ప్రారంభించనున్నట్లు కోటేశ్వరరావు వెంకయ్యనాయుడుకి తెలిపారు. పేదలకు ఉచిత విద్య, ఆరోగ్యం, పర్యావరణం, రైతు వికాసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలు పేదలకు అందేలా శ్రీభారత్ ట్రస్టు చేస్తున్న కృషిని వివరించారు.

సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు రైతు పక్షపాతి అని వాకాడు ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. కోటలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం యూరియా కార్డులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 34 టన్నుల యూరియా, 43.5 టన్నుల పోటాష్ అందుబాటులో ఉందన్నారు. ఎకరా పొలానికి విడతలవారీగా మూడు బ్యాగుల యూరియా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో సుచేంద్ర ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కోటారెడ్డి, మధుయాదవ్, ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా


రైతులకు యూరియా బస్తాలు అందజేస్తున్న వేనాటి శ్రీకాంత్‌రెడ్డి

తడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉందని తడ పీఏసీఎస్ చైర్మన్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులకు యూరియా పంపిణీ జరిగింది. చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పుడిప్పుడే వ్యవసాయ పనులు మొదలవుతున్నాయన్నారు. రైతులకు అందించేందుకు 2,200 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు రవి, సుధాకర్, సీఈవో రామయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నతశిఖరాలకు చేరుకోవాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. ముందుగా కళాశాల చైర్మన్ బ్రహ్మయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సురేష్ పవన్‌కుమార్, ఏవో మనోహర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లాను కలిసిన సంచి కృష్ణయ్య



పెళ్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డిలను పెళ్లకూరు మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నేతలను ఆయన కలిశారు.